క్లుప్తంగా

నేటి నుంచి భజన పోటీలు

మోమిన్‌పేట: మండల కేంద్రం మాణిక్ ప్రభు మందిరం ఆవరణలో శుక్రవారం సాయంత్రం నుంచి మండల స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు మండల బీజేవైఎం అధ్యక్షుడు అశిరెడ్డి తెలిపారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి సందర్భంగా ఆయన మనువడు విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మర్పల్లి మండలం బూచన్‌పల్లి, కోట మర్పల్లి, చక్రంపల్లి, దేవరంపల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల భజన మండలి భక్తులు పాల్గొనవచ్చని సూచించారు.

ఈ రోడ్డును విస్తరించండి..


మదన్‌పల్లి సింగిల్ రోడ్డు

అనంతగిరి: అసలే సింగిల్ రోడ్డు. ఆపై గుంతలమయమైన రహదారిలో వాహనాలు నడపలేక పోతున్నామని, ప్రయాణించడం కష్టంగా ఉందని వికారాబాద్ మండల పరిధి బాధిత గ్రామల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నుంచి మదన్‌పల్లి, మైలార్ దేవరంపల్లికి వెళ్లే రోడ్డుపై పలు చోట్ల గోతులు ఏర్పడిందని తెలిపారు. ఉన్న సింగిల్ రోడ్డు అధ్వానంగా ఉండి.. రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఈ రోడ్డులో కోట్‌పల్లి, బంట్వారం మండలాలకు చెందిన 20 గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారని, వెంటనే ఈ రోడ్డును రెండు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద దూడ కళేబరం

దోమ: విద్యుదాఘాతంతో దూడ మృతి చెందిన సంఘటన గురువారం మండల పరిధి ఐనాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఐనాపూర్‌కు చెందిన మేకల సాయిలు జీవనోపాధి కోసం పాడి పశువులను పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగే వాటిని మేతకు తీసుకెళ్తుండగా అందులో ఓ దూడ కంచలేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడింది. దాని విలువ రూ.10 వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. అధికారులు తమను ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు. ఇదిలా ఉండగా.. గ్రామాల్లో కంచలేని ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, తక్షణమే రక్షణ వలయం ఏర్పాటు చేయించేలా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి


స్మిత సబర్వాల్‌తో సర్పంచ్ మంజుల

కేశంపేట: గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మిత సబర్వాల్‌ను గురువారం రంగారెడ్డి జిల్లా వేములనర్వ సర్పంచ్ మంజుల కోరారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నేటి వరకు మంజూరు చేయలేదని సబర్వాల్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీలకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. ఈ విషయంలో స్మితసబర్వాల్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన రావిర్యాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన రౌడి కిల్లర్ జట్టు రూ.10వేలు వెచ్చించి మూడు బెంచీలు ఏర్పాటు చేశారు. వెంకటేష్, మహే శ్ శర్మ, అశోక్, సలీం, నవీన్, భాస్కర్, ఆసీఫ్ ఉన్నారు.

ఇంటి పన్నుల వసూలులో వేగం పెంచండి

షాబాద్: గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూలును వేగవంతం చేయాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. అభివృద్ధి పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

లక్ష్యం.. శత శాతం

- పది పరీక్షలకు సన్నద్ధం
- పూర్తయిన సిలబస్
- రివిజన్‌పై దృష్టిసారించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు
- వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ


పదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

దౌల్తాబాద్: ఈ ఏడు పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత రాబట్టేందుకు విద్యాశాఖ దృష్టి సారించింది. ఆ శాఖ సూచనల మేరకు దాదాపు సిలబస్ పూర్తి కావడంతో రివిజన్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టారు. మండలంలో 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 450మంది విద్యార్థులు చదువుకుంటుండగా.. హాజరుశాతం పెంచడంతో పాటు.. మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయ బృందం శ్రమిస్తోంది.

ప్రత్యేక తరగతులు

సుమారు 45 రోజులుగా పదో తరగతి విద్యార్థులకు రివిజన్‌తో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మార్చిలో వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యాన వెనుకబడిన పిల్లలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. హెచ్‌ఎంల ఆధ్వర్యంలో టీచర్లు ప్రత్యేక తరగతుల్లో పాల్గొనడంతో పాటు విద్యార్థులకు సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. స్పెషల్ క్లాసుల ద్వారా గ్రేడ్‌ను పెంచేలా చర్యలు చేపట్టారు.

పట్టు సాధిస్తున్నాం..



వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో పాఠాలపై పట్టు సాధించేందుకు మరింత కృషి చేస్తున్నాం. శ్రద్ధగా చుదువుకుంటూ.. సబ్జెక్టుల్లో వచ్చిన సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. పరీక్షలకు మేం సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం రివిజన్ జరుగుతోంది.

– శివనీల, పదోతరగతి విద్యార్థిని

ప్రశాంతంగా రాస్తాం..



ఎగ్జామ్స్ దగ్గర పడుతున్న క్రమంలో చదువుపై శ్రద్ధ పెంచుకుంటున్నాం. పాఠ్యాంశాలపై ఉన్న సందేహాలను, ప్రత్యేక తరగతుల ద్వారా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. పరీక్షలపై భయం వీడి, ప్రశాంతంగా రాస్తామనే నమ్మకం కలుగుతోంది.

–ఎండీ అమన్, విద్యార్థి

మెరుగైన ఫలితాల కోసం..



పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్నాం. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పాఠ్యాంశాల్లో వారికి వస్తున్న సందేహాలను తీరుస్తున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తయి, రివిజన్ కొనసాగుతోంది. గతంలో కంటే మెరుగైన రిజల్ట్ సాధిస్తామనే నమ్మకం ఉంది.

–సోమురాజు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, బాలంపేట

ప్రత్యేక తరగతులు తప్పనిసరి

మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం మండల కేంద్రం ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యాభ్యాసంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పది వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా పునశ్చరణ తరగతులు, స్లిప్ టెస్టులు నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి రోజు విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం పాఠ్యాంశాలను బోధించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, స్పెషల్ తరగతులను నిర్వహించేలా శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్, లాల్య, ప్రధానోపాధ్యాయుడు రాములు తదితరులు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ

'బల్మూరి'కి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం హర్షణీయం


అవినాష్‌రెడ్డి

ధారూరు: బల్మూరీ వెంకట్‌కు ఎమ్మెల్సీ టిక్కెట్ ఇవ్వడంపై ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్.. విద్యార్థులు, నిరుద్యోగుల తరపున పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధిష్టానం ఆయన చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం సామా న్య కార్యకర్తల్లో ఉత్సాహం నింపిందన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: మండల పరిధి రాంపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు ప్రమాదశాత్తు భవనంపై నుంచి కిందపడి కొంత కాలంగా ఇంటికే పరిమితమయ్యాడు. అనారోగ్య సమస్యలతో గురువారం కుల్కచర్ల గ్రామానికి చెందిన యాదయ్య చనిపోయాడు. ఈ మేరకు విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరమ్మ ఇరు కుటుంబాలకు చెరో రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మణ్, గాంగ్యనాయక్, తిరుపతి, బాల్‌రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడికి సన్మానం


మాధవరెడ్డిని సన్మానిస్తున్న మల్లేశ్ యాదవ్

మర్పల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మాధవరెడ్డిని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ గురువారం వికారాబాద్ పట్టణం ఆయన స్వగృహంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గానికి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.

'అభయహస్తం' ప్రక్రియ పూర్తి


దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- మిగిలింది లబ్ధిదారుల ఎంపికే
- ఎంపీడీఓ వినయ్‌కుమార్

షాద్‌నగర్: రాష్ట్రంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా రెండు పథకాలను అమలు చేసింది. మిగితా పథకాలకు సంబంధించి డిసెంబర్ 28న ప్రారంభించి జనవరి 6వరకు అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పేరిట ఐదు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పథకాల కోసం భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాలతో పాటుగా, షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో 90,254 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఈ నెల 12 నుంచి 17 వరకు చేపట్టారు. అధికారులు కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను వినియోగించుకొని నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేశారు.

మార్గదర్శకాలు వస్తేనే...

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయినా లబ్ధిదారుల ఎంపిక ఎలా చేపడుతారన్నదానిపై ప్రభుత్వంనుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మహాలక్ష్మీ పథకానికి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇళ్ల కోసం చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపికకు తెల్లరేషన్‌కార్డు, ఆధార్ నంబర్లను ప్రామాణికంగా తీసుకుంటారని తెలుస్తుంది. అయితే అధికారులు ఇంటింటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి వివరాలు సేకరించి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తుంది.

షాద్‌నగర్ నియోజకవర్గం దరఖాస్తుల వివరాలు..

మండలం	వచ్చిన దరఖాస్తులు
కొత్తూరు	5,847
కొందుర్గు	9,345
జిల్లేడు చౌదరిగూడ	9,912
కేశంపేట	13,801
ఫరూఖ్‌నగర్	19,859
నందిగామ	9,124
కొత్తూరు	4,011
షాద్‌నగర్ మున్సిపాలిటీ	18,355

అలుపెరగని 'ఆంజనేయుడు'

సంస్కారాన్ని రంగరించి, వ్యక్తిత్వాన్ని నిర్మించి, విద్యను బోధించి, విజ్ఞానాన్ని పెంపొందించి సుశిక్షితులైన పౌరులుగా తీర్చిదిద్దే గురువుల సేవలు వెలకట్టలేనివి. తల్లిదండ్రుల తరువాత అంతటి ప్రాధాన్యత వారికే. అలాంటి వృత్తికి ఆదర్శంగా నిలవడమే కాకుండా.. మూడేళ్లుగా విరామం ఎరగకుండా విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు ఆంజనేయులుపై 'సాక్షి' కథనం..

- మూడేళ్లుగా నిర్విరామంగా విధుల నిర్వహణ
- తన పిల్లలను సైతం సర్కారు బడిలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు


పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆంజనేయులు

కుల్కచర్ల: సమాజంలో ప్రాముఖ్యత గల వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఒకటి. అలాంటి వృత్తిని నేడు కొందరు జీతం కోసం కొనసాగిస్తే.. ఇంకొందరు ఉద్యోగ భద్రతకోసం చేస్తుంటారు!. కానీ ఈ ఉపాధ్యాయుడు.. మాత్రం వృత్తే దైవంగా, పాఠశాలే దేవాలయంగా, విద్యార్థుల భవిష్యత్తే తన లక్ష్యంగా అలుపెరగకుండా పనిచేస్తున్నారు ఆంజనేయులు.

ఒక్కరోజు సెలవు పెట్టకుండా..

ప్రతీ ఒక్కరి జీవితంలో ఏదో ఒక అవసరంతో విధులకు హాజరుకాకుండా ఉద్యోగరీత్యా ఉన్న సెలవులను ఉపయోగించుకుంటారు. కానీ పుట్టపహడ్ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు ఆంజనేయులు మాత్రం (ప్రభుత్వ సెలవు దినాల మినహా) ఏ ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా.. అంకితభావంతో విధులకు హాజరవుతూ.. నిరంతరం విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. మూడేళ్లుగా అంటే 1,095రోజుల పాటుగా పిల్లల చెంతే ఆయన ధ్యాస.

తండ్రి బాటలోనే తనయులు

బాధ్యతగల ఉపాధ్యాయుడిగా తండ్రి ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారో.. ఆయన కుమారులు అంతే బాధ్యతతో రెండేళ్లుగా.. డుమ్మా కొట్టకుండా బడికి వస్తున్నారు. 10వ తరగతి చదువుతున్న సత్యప్రకాష్, 9వ తరగతి చదువుతున్న జ్ఞానప్రకాష్‌లు తండ్రిలాగే.. తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారం రోజుల క్రితం పాఠశాల విజిట్‌కు వచ్చిన నోడల్ ఆఫీసర్.. పాఠశాల రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయుడు ఆంజనేయులును ఘనంగా సన్మానించారు.

ఓటరు జాబితాపై పకడ్బందీ చర్యలు

- తహసీల్దారు వెంకటేశ్
- బీఎల్‌ఓలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు వెంకటేశ్

బొంరాస్‌పేట: ఓటరు జాబితాపై పరిపూర్ణ అవగాహనతో, పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తహసీల్దారు వెంకటేశ్ బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21, 25న బీఎల్‌ఓలకు ప్రత్యేక క్యాంపెయిన్‌లు ఉన్నాయని, తమ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఫారం 6, 7, 8లను స్వీకరించాలన్నారు. అలాగే ఏఎస్‌డీ (ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాను తయారు చేయాలని చెప్పారు. ఈ నెల 6న జరిగిన ఓటరు సవరణ జాబితాకు అనుగుణంగా డబుల్, పర్మినెంట్ షిఫ్టెడ్, చనిపోయిన వారి వివరాలను సేకరించి, మండల స్థాయి అధికారికి సమర్పించాలన్నారు.

25న ఓటరు దినం

ఈ నెల 25న జాతీయ ఓటరు దినాన్ని ఘనంగా నిర్వహించాలని తహసీల్దారు వెంకటేశ్ బీఎల్‌ఓలకు సూచించారు. అదే రోజు ఉదయం మండల కేంద్రం , గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించి, ప్రజలకు ఓటుహక్కుపై చైతన్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు రవిందర్ ఉన్నారు.

జెడ్పీటీసీ నిధులతో పాఠశాలలో బోరు


గిరిజన గురుకుల పాఠశాల్లో బోరు తవ్విస్తున్న జెడ్పీటీసీ

తాండూరు రూరల్: పాఠశాలల్లో విద్యార్థుల తాగు నీటి సమస్య తీరుస్తామని జెడ్పీటీసీ గౌడి మంజుల అన్నారు. గురువారం మండల పరిధి జినుగుర్తి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో జెడ్పీ నిధులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలో పలు పాఠశాలలు, శ్మశాన వాటికతో కలిపి మొత్తం 11 బోర్లు మంజూరు చేశారని తెలిపారు. ప్రిన్సిపాల్ పార్వతమ్మ, నాయకులు గౌడి వెంకటేశం ఉన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వం కృషి

- స్పీకర్ చొరవతో వార్డుల అభివృద్ధి
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల


స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి 7,8,9వ వార్డు మద్గుల్ చిట్టంపల్లి, బూర్గుపల్లిలో ఆమె పర్యటించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడారు. ఎమ్మెల్యే, శాసనసభాపతి జి. ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు మూడు వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకున్నానని, వాటిని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముక్తార్ షరీఫ్, కౌన్సిలర్లు గోపాల్, సంతోష, కమిషనర్ జాకిర్ అహ్మద్, ఏఈ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు

చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు

మొయినాబాద్/చేవెళ్ల: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ సీట్లలో ప్రయాణికులను కూర్చొపెట్టొద్దన్నారు. ప్రతీ ఆటోడ్రైవర్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ యూనిఫాం తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గడపగడపకూ కేంద్ర పథకాలు


చర్లగూడలో వికసిత్ భారత్ యాత్రలో కిరణ్

బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్

షాబాద్: ప్రతీ గడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో వికసిత్ భారత్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఆయుష్మాన్ భారత్, పీఎం జేవై, పీఎం గరీబ్ కల్యాణ్, అన్నా యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన తదితర 17 రకాల పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, వెంకటేష్‌గౌడ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు: మండలంలోని వెంకిర్యాల సంజీవపురం చింతల శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. వెంకిర్యాల, తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, లక్ష్మిదేవిపల్లి తదితర గ్రామాల ప్రజలు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి దేవాలయ ఆవరణలో భజనలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం, తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ, మాచిరెడ్డి, సర్పంచులు లింగం గౌడ్, బాల్‌రాజ్, శ్రీధర్ రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.